శిక్షణను వాయిదా వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈ నెల 13 నుంచి 22వ వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులకు టీచ్ టూల్ అంశంపై నిర్వహించబోయే సాల్ట్ పథకం శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌కు వారు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థు లకు కార్యాచరణ ప్రణాళిక, ప్రీఫైనల్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాల్సి అవసరముందని, కావున శిక్షణా కార్యక్రమం వాయిదా వేయాలని కోరారు.



ఎడికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

- డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిఒ కాపీలను సోమవారం దహనం చేశారు. ఈ సదర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను కావాలని సృష్టిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ యువకులను మోసం చేసే విధంగా ముందుకు వెళ్లడం సిగ్గుచేటు అన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో సుదీర్ఘకాలం అనేక పోరాటాలు చేసి రద్దు చేసుకున్న అప్రెంటీస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరింప చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం దారుణమని చెప్పారు. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్‌సి వస్తుందని నిరుద్యోగ ఉపాధ్యాయులు సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం 6000 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం తీవ్ర నిరాశకు గురి చేసిందని పేర్కొన్నారు. ఇచ్చిన అరకొర డిఎస్‌సిలో మరలా వెట్టి చాకిరీ విధానమైన అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు నిరంతరం పోరాడుతుంటే ఉన్న సమస్యలను పరిష్కరించకపోవడం ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టించి ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టివేసే ప్రణాళికతో ముందుకు వెళ్లడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గతంలో ఉన్న అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయించుకోవడం కోసం 15 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటాలు చేశామని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 13 రోజులపాటు సమ్మె కూడా చేసి అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయించుకోగలిగామని పేర్కొన్నారు. తన తండ్రి రద్దు చేసిన వ్యక్తి చాకిరీ విధానాన్ని పునరుద్ధరించడం ఎంతవరకు సబబు ఆలోచించుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగమే సాధనగా కుటుంబాలకు దూరమై కోచింగ్ సెంటర్లు వెంబడి సుదీర్ఘకాలం పాటు కళ్లుకాయలు కాసేలా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన యువతకు ఈ డిఎస్‌సి నోటిఫికేషన్ ఒక శరాగతంగా ఉందని తెలిపారు. ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత ధరల్లో అప్రెంటీస్ విధానంతో ఉపాధ్యాయులు నియామకం పొందితే వారి జీవన విధానం ఎలా నెట్టుకు రాగలరని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఈ రోజు విడుదల చేసిన అప్రెంటీస్ విధాన డిఎస్‌సి నోటిఫికేషన్ రద్దు చేసి రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేసే విధంగా నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగ ప్రజా సంఘాలను ఏకం చేసి ఈ ప్రభుత్వం మెడలు వంచన ఇలాంటి జిఒలు రద్దు చేయించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, జిల్లా కౌన్సిలర్ తిరుపతి, అన్వర్ బాషా, మధుసూదన్ రాజు హరికృష్ణ, శ్రీవాణి పాల్గొన్నారు.

జిఒ ప్రతులు దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలు మళ్లీ రీఓపెన్ కాకుండా నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం అత్యంత కీలకమని చెప్పారు. రీ ఓపెన్ కాకుండా అర్జీలు పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం, అధికారులపై ప్రజలలో నమ్మకం పెరగాలంటే జగనన్నకు చెబుదాం అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో వేగవంతంగా పరిష్కరిం చాలన్నారు. డివిజన్ స్థాయిలో, మండలాలలోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా ప్రాధాన్యతతో నిర్వహించాలని డివిజన్, మండల అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అదే సమస్యతో ప్రజలెవ్వరూ ఆఫీసుకు రాకూడదని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

విఆర్ఎలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విఆర్ఎల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు, విఆర్ఎల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందర పాదయాత్రలోనూ విజయవాడలో గ్రామ సేవకుల నిరాహార దీక్ష శిబిరం వద్దకు వచ్చి, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15 వేలు, గ్రామ సేవకులకు వేతనం పెంచుతానని హామీ ఇచ్చారని సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు చేతుల మీదగా చెక్కులు ఇస్తానని, చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని గుర్తు చేశారు. ఐదేళ్లలో జగన్ విఆర్ఎల ఒక్క సమస్య పరిష్కారం చేయలేదని, చేయకపోగా గతంలో సిఐటియు పోరాటం చేసే సాధించుకున్న డిఎ రూ.300ను రికవరీ చేశారని తెలిపారు. 2018 నుంచి దాన్ని తిరిగి అరియర్స్ కింద చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మాదిరిగా విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేసి ప్రమోషన్ ఇవాలన్నారు, విఆర్ఎలు, అటెండర్లు, వాచ్మెన్లు, డ్రైవర్లు, స్వీపర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ధరలు తగ్గించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటలు చేయడానికి రద్దు చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 16 జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. 20వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఎలు ఆందోళన చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘ నాయకులు లక్ష్మీకర్, సి.కుమార్, బత్తెన సుబ్రహ్మణ్యం, కనుపర్తి మనీ, బుర్రు, నాగరాజు, బుల్లేష్, సింగమల సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, రామంజులమ్మ పాల్గొన్నారు.

రైతు మిత్రల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలో ఉన్న రైతు మిత్రల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో రైతు మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మిత్రలకు పెండింగ్ లో ఉన్న 11 నెలల బకాయిలు విడుదల చేయాలని తెలిపారు. యఫ్‌పిజిల ద్వారా వచ్చే వడ్డీతో రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు వేతనం ఇస్తున్నారని, ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే ఏమాత్రం చాలడం లేదని వాపోయారు. ప్రభుత్వమే వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. భవిష్యత్‌లో రైతు మిత్రల సమస్యలపై నిరవధిక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, రైతు మిత్రలు రాజారెడ్డి, హేమలత, రామచంద్ర, వెంకటసుబ్బయ్య , సుధాకర్ రెడ్డి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉన్నత స్థాయి కమిటీ వేయాలని ప్రిన్సిపల్‌కు వినతి

ప్రజాశక్తి-మదనపల్లి

బిటి కళాశాలకు వచ్చిన ప్రొసీడింగ్స్‌పై ఉన్నత స్థాయి కమిటీని నియమించి అర్హులకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని బహుజన యువ సేన, రాయలసీమ విద్యార్థి, యువజన జెఎసి ప్రిన్సిపల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ కార్యదర్శికి, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బిటి కళాశాలలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అనంతరం కళాశాలలో అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా ఉంటాయని పూర్వ విద్యార్థులు, విద్యార్థి, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తే ఇంకా ఎక్కువ అవడాన్ని తప్పుబట్టారు. జిఒ అక్రమని అందులో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుల మీద ప్రభుత్వం విచారణ కమిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్‌కు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలన చేయకుండా నామమాత్రంగా చేసి ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఎలాంటి అర్హతలు లేని వారికి జీతాలు చెల్లించుటకు ప్రక్రియలో భాగంగా ఒక జాబితాను పంపించారని పేర్కొన్నారు. ఎవరికీ కానీ సర్వీస్ రెగ్యులర్‌గా లేక పోయినా వారికి అర్హతలు ఉన్నట్టు వచ్చాయన్నారు. నిజాయితీగా విధులు నిర్వహించిన వ్యక్తుల పేర్లను మాత్రం ప్రభుత్వానికి అప్పగించాలని యాజమాన్యంనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారి పేర్లను కక్షపూరితంగా వారి మీద వివక్ష చూపుతూ అన్ని అర్హతలు కలిగిన వారి పేర్లు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన జిఒలో కానీ, ప్రొసీడింగ్స్‌లో కానీ వారి పేర్లు రాకుండా చేయడం కమిటీలకు, కమిటీలో ఉన్న వ్యక్తులకు రికార్డులు చూసి సక్రమంగా పరిశీలన చేస్తే అర్థమవుతుందని పేర్కొన్నార. ఉన్నత విద్యా శాఖ వారు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి ఉన్నత స్థాయి కమిటీని నియమించి అక్రమంగా జిఒలో వచ్చిన వారి మీద శాఖ పరమైన చర్యలు తీసుకొని అర్హతలు కలిగిన వారికి న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తా మని హెచ్చరించారు. ప్రిన్సిపల్ శ్రీఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన వినతి పత్రంపై ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ రిపోర్ట్ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పుణీత్, రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులు ఉత్తన్న, ప్రభు, సురేష్ బహుజన యువసేన నాయకులు నవీన్, సుధాకర్, ఆది, శశి, ప్రభాకర్, రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రభుత్వ భూములు ధారాదత్తం : అఖిలపక్షం

ప్రజాశక్తి-మదనపల్లి

యాత్ర-2 సినిమా డైరెక్టర్‌కి హార్సిలీహిల్స్‌లో రెండు ఎకరాల భూమిని కేటాయించడంపై ప్రభుత్వ భూములను ధారాదత్తం చేయటాన్ని టిడిపి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్, సిపిఐ నాయకులు కృష్ణప్ప, శ్రీచందు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి మీదుగా రైల్వేలైన్‌ని రద్దు చేపించి, హంద్రీ-నివా నీటిని మదనపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నింపకుండా పుంగనూర్‌కు తరలించడం దుర్మార్గమన్నారు. మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించకుండా, బిటి కళాశాలను ప్రభుత్వ పరం చేయలేని ప్రభుత్వం కోట్ల రూపాయల భూమిని కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిచారు. వెంటనే జిఒను రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా నిరసనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎఒకు వినతిపత్రాన్ని అందజేశారు. మదనపల్లి నియోజకవర్గానికి చెందిన జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లాల కార్యదర్శి జంగాల శివరాం, తెలుగుదేశం పార్టీ నాయకులు సురేంద్ర యాదవ్, ఆర్జే వెంకటేష్, పర్వీన్ తాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని చెన్నయ్ ఎన్ఐటిటిటిఆర్ ప్రొఫెసర్ మల్లిగా అన్నారు. సోమవారం మిట్స్ ఇంజినీరింగ్ కళావాలలో వృత్తిపరమైన అభివృద్ధిపై సదస్సు నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లలో నిరంతర నాణ్యత మెరుగుదలకు ఎన్‌బిఎ అక్రిడిటేషన్ కీలకమన్నారు. వృత్తిపరమైన అభివృద్ధి ప్రోగ్రామ్ దాని పూర్తి ప్రక్రియ, మూల్యాంకనంతో పాటుగా అక్రిడిటేషన్ యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకునే అవసరాన్ని తీర్చడానికి రూపొందించబడిందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ రంగంలో విద్య యొక్క మొత్తం నాణ్యతను పెంపొందించడంలో, సంస్థలు స్థాపించబడిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యలో అత్యుత్తమ సంస్కృతిని పెంపొందించడం ద్వారా ఎన్‌బిఎ అక్రిడిటేషన్ ప్రక్రియ గురించి సమగ్ర పరిజ్ఞానంతో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడం ప్రోగ్రామ్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణను అందిస్తామని సకాలంలో వీటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్క్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాతన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మల్లిగా

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన రైతులను కార్యాలయాల చుటూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ అరవింద్ కిషోర్‌ను కోరారు. రైతులు ముఖ్యంగా అడంగల్, వన్-బి, భూమి కొలతలు తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తారని వారిని ఎక్కువ రోజులు కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా త్వరగా పనులు చేసి పంపాలని పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు పనులు చేయకుండా వేధిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆయన వెంట లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచులు భూషణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామాంజులు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - రాయచోటి

2024 మొదటి త్రైమాసికానికి సంబంధించి ఈనెల 13న జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు రాయచోటి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని, కమిటీ సభ్యులందరూ కూడా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-కలికిరి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి అయితనే భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని చీకటపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చీకటపల్లి గ్రామ పంచాయతీ రంగనాథపురం, చీకటిపల్లిలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 14వ తేదీ జరగనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎంతో అన్యాయం జరిగిందన్నారు. వారికీ న్యాయం చేయడానికి భవిష్యత్తుకు గ్యారంటీ స్కీమును ప్రవేశపెట్టి, అందులో భాగంగా 6 గ్యారంటీలతో ప్రతి ఒక్క కుటుంబం లబ్ధి పొందే విదంగా కార్యాచరణ రూపొందించారని పేర్కొన్నారు. గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు అన్ని రకాల లబ్ధి పొందారన్నారు. మరొకసారి తెలుగుదేశం ప్రభుత్వంపై ఆదరణ చూపించి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వరూప్ కుమార్‌రెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, ఎడగొట్టి చిన్న రెడ్డప్ప, గానుగ చింతకృష్ణ, గజ్జల చిన్ని, వలపు రమేష్, కేంగాణ వేణు, మంచూరి వెంకటరమణ, తేజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ముమ్మరంగా పాఠశాల మైదానం పనులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ పథకం కింద మంజూరైన రూ. లక్షతో నాలుగు క్రీడా కోర్టులు ఏర్పాటులో భాగంగా సోమవారం మైదానం చదును పనులు ముమ్మరంగా చేపట్టారు. వాలీబాల్, షటీల్, టెన్నికాయిట్, కబడ్డీ, లాంగ్‌జంప్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. మైదానమంతా ఎర్రమట్టి తోలించి చదును చేయిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కానాల శివారెడ్డి, బుక్కపట్నం సుబ్బరాయుడు, మహమ్మద్ గౌస్ సహకారంతో వల్ల పాఠశాలలో అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు. పాఠశాల చుట్టూ మూడు వైపులా ప్రహరీ ఉందని, మరో వైపు లేకపోవడంతో తాత్కాలికంగా స్తంభాలు నాటి చుట్టూ కంచె వేయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

ప్రజాశక్తి-కలకడ

సచివాలయం ఉద్యోగిపై దాడి జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సచివాలయంలో జెఎల్‌ఎంగా బి.మనోహర్ విధులు నిర్వహిస్తున్నారు. ఎర్రయ్యగారిపల్లి సచివాలయంలో తాను నాలుగున్నర సంవత్సరాలుగా జెఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారని, అయితే ఎర్రయ్యగారిపల్లెలో ఉన్న ట్రాన్సఫార్మర్‌కు 100 కెవిఎ కెపాసిటీ ఉండటంతో దానిని 160 కెవిఎ కెపాసిటీ పెంచడానికి ట్రాన్స్‌కో ఎఇ, ఎడిఎ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్‌గా విధులు చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో తమకున్న లోడర్లకు విద్యుత్ చాలడం లేదని దౌర్జన్యం చేసి దుర్భాషలాడి జెఎల్‌ఎం మనోహర్‌ను, అదే గ్రామానికి చెందిన ఆనంద, మధుసూదన అనే వ్యక్తులు దుర్భాషలాడి కొట్టి దాడి చేసినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జెఎల్‌ఎం తెలిపారు.

పీలేరు ఆర్‌టిసి బస్టాండ్‌కు మరమ్మతులు

బస్టాండ్‌లో పెచ్చులూడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ బస్టాండ్ పైకప్పుకు ఎట్టకేలకు మరమ్మతు పనులు చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పై కప్పు వర్షాకాలం ఉరుస్తూ బస్టాండు జలమయం కావడం, వ్యాపార సముదాయాల్లోకి మీరు త్వరపడి సమస్యలకు కారణం అవడంతో పాటు పై కప్పు పెచ్చులూడి క్రింద పడుతుండడంతో అటు ప్రయాణికులు, ఇటు వ్యాపారులకు ప్రమాదకరంగా పరిణమించింది. స్థానిక మీడియా ప్రతినిధులు పీలేరు డిపో తనిఖీలకు వచ్చిన ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను పలు మార్లు తీసుకెళ్లింది. ఇందుకు స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్టీసీ బస్టాండు భవనం కప్పుపై భాగంలో కంకర, సిమెంట్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేసే పనులతో పాటు పెచ్చులూడి పడుతున్న సీలింగ్ మరమ్మతు పనులకు కూడా అయ్యే ఖర్చు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే మరమ్మత్తు పనులకు అనుమతులు, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. దీంతో ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులు చేపట్టారు. ఇక నుంచి వర్షపు నీరు ఉరిసే పరిస్థితులు, పై కప్పు పెచ్చులు ఊడే ప్రమాదాలు తప్పుతాయని బస్టాండ్‌లోని వ్యాపార సముదాయాల నిర్వాహకులు, ప్రయాణికులు ఆశిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సాయివికాస్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.వడ్డిపల్లి గ్రామానికి చెందిన బత్తల ప్రసాద్ (43) శుక్రవారం అప్పయ్యరాజుపేట వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి సోమవారం రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుడి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ మృతుడి పిల్లలకి, చదువు విషయంలో ఎల్లవేళలా తోడుంటామని తెలిపారు. కార్యక్రమంలో ముక్కవారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, కె.చిన్నయ్య, కె.వెంకటసుబ్బయ్య, కె.యానారాయణ, పసుపులేటి వెంకటరమణ, రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తమ్ విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్, ఎఎన్ఎంలు కె.రామలక్ష్మి, కె.మహేశ్వరి, ఇ.మాధవి, ఆశా వర్కర్ ఎం.పూర్ణిమ, తదితరులు కళాశాల విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం ఎలా తెలుసుకోవాలో వివరించి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకట నరసయ్య, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, వి.పార్వతి, బి.నాగరాజ , విద్యార్థులు, తదితరలు పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని దిన్నిమీదపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత విగ్రహ ప్రతిష్టాపన, కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై సీతారాముల కల్యాణానికి రూ.5,116 సదింపులు చదివించారు.

గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, అర్చకులు రమేష్ బాబులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ముత్యపు పందిరి సింహ వాహనాలపై ప్రత్యేక అలంకరణ చేశారు. సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. టిటిడి ధర్మ ప్రధాన పరిషత్ ఆధ్వర్యంలో రాత్రి హరికథ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అల్లరింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపీనాథ్, ఇన్‌స్పెక్టర్ దీక్షిత్ కుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు విది నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఎంపిడిఒ కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో అందజేయాలన్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. కాలనీలలో ఇంటి పట్టాల లబ్ధిదారులకు ఆ పట్టాలు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఒ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.No : 182/2018
I.A.No : 435/2015
O.S.No : 144/2011

షేక్ ఆయేషా బేగం భర్త హబీబుల్లా మసీదు దగ్గర, నూనె వారిపల్లి రాజంపేట టౌన్ పోస్ట్ & మండలం కడప జిల్లా, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా.

...పిటిషనర్/వాది

వర్సెస్

R3.ఎస్ ఎం డి వాజిద్ తండ్రి లేట్ చాంద్ బాషా
R8.ఎస్ సర్తాజ్ తండ్రి, లేట్ చాంద్ భాషా భర్త సలాం పై ఇరువురి నివాసం డోర్ నంబర్స్ 6/1034 & 6/1035 ఆర్ఎస్ రోడ్డు, రాజంపేట టౌన్ పోస్ట్ మరియు మండలం, కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్స్ నెం 3 మరియు 8.

3 మరియు 8 ప్రపోజ్డ్ ప్రతివాదులు

పై కనపరిచిన పిటిషనర్/వాది రెస్పాండెంట్స్ నెం 3 మరియు 8/3 మరియు 8 ప్రపోజ్డ్ ప్రతివాదులగు మీ పై I.A.No.435/2015లో 02.08.2017వ తేదిన పాలించిన డిస్మిసల్ ఉత్తర్వులను రద్దుపరిచి పై పిటిషన్ ను యధాస్తానానికి తేవాల్సిందిగా కోరుతూ మీ పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఆక్షేపణలు ఉన్న ఎడల 15.02.2024వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

పి.ఆనంద కుమార్
పిటిషనర్ పరం అడ్వకేట్,
రాజంపేట

సంబరాలు సరే... డబ్బులేవి?

- ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణలు
- లబోదిబోమంటున్న డ్వాక్రా సంఘాల మహిళలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మహిళలకు మహారాణులను చేస్తామంటూ వైఎస్ఆర్ ఆసరా పేరుతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2019 ఏప్రిల్ 17వ తేదీ వరకు స్వయం సహాయ సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తానని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని ప్రకటించారు. ఇప్పటి వరకు మూడు సార్లు బ్యాంకుల్లో నగదు జమ చేశారు. జగన్ ప్రభుత్వం హామీ మేరకు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కింద నిధులను గత నెల 23వ తేదీన అనంతపురం జిల్లా ఉరవకొండలో భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్వయంగా బటన్ నొక్కి నగదు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదేరోజు జిల్లా వారీగా మంత్రులు స్వయం సహాయ సంఘాల మహిళలకు మెగా చెక్కులు అందజేశారు. అనంతరం ఏ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేలు ఆయా మండలాల వారీగా ప్రజా ప్రతినిధులు సభలు ఏర్పాటు చేసి చెక్కులు అందజేశారు. నాటి నుంచి నేటి వరకు స్వయం సహాయక సంఘాల మహిళలు ఆసరా డబ్బులు కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. 20 రోజులైనా డబ్బులేవి..? వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడతలో పుల్లంపేట మండలంలో దాదాపు 438 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళ సంఘాలకు మొత్తం సుమారు రూ.17 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్వయం సహాయక సంఘాల మహిళల వ్యక్తిగత ఖాతాల్లో ఆ డబ్బులు జమ చేస్తున్నట్లు జనవరి 23న బటన్ నొక్కారు. ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా ప్రచార సభల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేశామంటూ గొప్పలు చెబుతున్నారు. మహిళలు ప్రతిరోజు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. డబ్బులు మాత్రం మహిళల ఖాతాల్లో జమ కాక స్వయం సహాయక సంఘాల మహిళలు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ పొందేందుకు బ్యాంకు వరకు వచ్చి పోయేందుకు రెండు, మూడు వందల రూపాయలు ఖర్చు అవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే ప్రభుత్వ రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారా? లేదా అనే సందేహాలు డ్వాక్రా మహిళల్లో వ్యక్తం చేస్తున్నారు.

ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు (ఫైల్ ఫోటో)

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారాహి యాత్ర : దినేష్

సభలో మాట్లాడుతున్న జనసేన నాయకులు అతికారి దినేష్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట నియోజకవర్గంలో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందని జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సోమవారం దినేష్ జనసేన నాయకులతో కలిసి మినీ వారాహిని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా మన్నూరులోని యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి జనసేన పార్టీ కార్యాలయం నుంచి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు అమ్మవారికి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మినీ వారాహికి పూజలు చేసి భారీ జనశ్రేణుల మధ్య అతికారి దినేష్ ఊరేగింపుగా యల్లమ్మ దేవలయం నుంచి జనసేన కార్యాలయానికి జన సందోహంతో బయలుదేరారు. మార్గ మధ్యంలో జనసేన పార్టీ మండలాల నాయకులు భారీ గజమాలను ఏర్పాటు చేసి క్రేన్ ద్వారా అతికారి దినేష్‌ను సత్కరించారు. అనంతరం జనసేన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో సీనియర్ నాయకులు అతికారి వెంకటయ్య మాట్లాడుతూ రాజంపేట జనసేన అడ్డా అని, ఇక్కడ జనసేనను గెలిపించుకొని పవన్ కళ్యాణ్‌కు కానుకగా ఇవ్వాలని పేర్కొన్నారు. అతికారి దినేష్ మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి మండలాన్ని మినీ వారాహి ద్వారా సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. యువతకు ప్రాధాన్యత ఇస్తూ వారికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తానని హామీ ఇచ్చారు. జనసేన జెండాను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజల పక్షాన పోరాడిన ప్రతి నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన మాట్లాడుతూ రాయలసీమ ఆడబిడ్డలు చైతన్యంతో ముందుకు వచ్చి భావితరాల భవిష్యత్తును కాపాడుకునే దిశగా అడుగులు వేయాలని కోరారు. మహిళలను కించపరిచే విధంగా వ్యక్తిగత విమర్శలు చేస్తున్న అధికార వైసిపి అహంకారాన్ని తుంచే విధంగా గట్టి తీర్పును ఇవ్వాలని కోరారు. అనంతరం జనసైనికులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట కార్యదర్శులు ముఖరం చాన్, తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ పోగ్రం జోన్-1 కన్వీనర్ జోగినేని మణి, సిద్దవటం సర్పంచ్ ఓబులయ్య, రాజంపేట నియోజకవర్గ నాయకులు కొట్టే శ్రీహరి, గుగ్గిళ్ళ నాగార్జున, పోలిశెట్టి శ్రీనువాసులు, జిగిలి ఓబులేసు, ఉపేంద్ర, వీరమహిళలు వరలక్ష్మి, కొట్టే మణెమ్మ, భారీ సంఖ్యలో జనసేన నాయకులు, వీరమహిళలలు, జనసైనికులు, ప్రజలు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి : 'పోకల'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు, పిల్లలకు కనిపించే దైవం తల్లిదండ్రులు గురువులేనని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ పోకల సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక అలంకార్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పదవ తరగతి చదువుతున్న ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది అన్నారు. నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. నిత్యం మనముందు కనపడే తల్లిదండ్రులు, గురువుల వద్ద ఆశీర్వాదం పొందాలన్నారు. విద్యపై ధ్యాస ఉంచే సమయంలో చెడు సావాసం, సెల్ ఫోను, టివి, పక్క చూపులు పెట్టరాదన్నారు. ఏకాగ్రతగా అర్థం చేసుకుంటూ చదివితే మంచి ఫలితాలను సాధించి ఉన్నత స్థానాలు చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్ అంతా మీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, పద్మావతి హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రఓబుల్ రెడ్డి, రాఘవేంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ రామిరెడ్డి, గౌతమ్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీరెడ్డి, మైలవరం చైతన్య స్కూల్ చెన్నప్ప విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రేడియన్స్ దస్తగిరి, చల్లపల్లి (సరస్వతి విద్యా మందిరం) రమేష్‌రెడ్డి, విశ్వజ్యోతి పరిమళ, జాన్స్ హైస్కూల్ రవిశేఖర్, టికెఆర్ జీవన్‌జ్యోతి ప్రధానోపాధ్యాయులు గురుశేఖర్, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోకల సుబ్బారెడ్డి

వేలం పాట నిర్వహిస్తున్న చైర్మన్, అధికారులు

పార్కింగ్ వేలంలో రూ.3.8 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాల సందర్భంగా వాహనాల పార్కింగ్ వేలంపాటను కొండపై సోమవారం నిర్వహించారు. వేలం పాటలో శేఖర్ రూ.3,83,500 పాట దక్కించుకున్నారు. గతంలో జరిగిన వేలంపాట ద్వారా ఆలయానికి రూ.15,4500 ఆదాయం వచ్చినట్లు మల్లయ్య కొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి కిరణ్ కుమార్ రెడ్డి, ఇఒ రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అన్నమయ్య జిల్లా చైర్మన్‌గా మదనపల్లికి చెందిన న్యాయవాది తోట్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ డాక్టర్ శాస్త్రి జంధ్యాల నుండి వెంకటరమణరెడ్డికి ఉత్తర్వులు అందాయి. ఇటీవలే కొత్తగా నియమితులైన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల, లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ శాస్త్రి జంధ్యాల నుండి ఉత్తర్వులు అందుకున్నారు. వెంకటరమణారెడ్డి మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలకి సంబంధించి ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. వృత్తిలో వెంకట రమణారెడ్డి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అన్నమయ్య జిల్లాకు సంబంధించి లీగల్ సెల్ కన్వీనర్ గా నియమించారు. ఇతని నియామకం పట్ల మదనపల్లె న్యాయవాదుల సంఘం, రాజకీయ నాయకులు, ప్రజలు, రైతులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-ములకలచెరువు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాహ నాలు నడపాలని ములకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండలంలోని కదిరి రోడ్డులో వాహనాలు తనిఖీ చేపట్టారు. అనంతరం ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా లైసెన్స్ తో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులను కలిగి ఉండాలని అవగహన కల్పించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది శంకర్నాయక్ ఉన్నారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : మార్చి 3న దేశవ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిపి సభా భవనంలో సోమవారం పల్స్ పోలియోపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. మిగిలిన చిన్నారులకు నాలుగు, ఐదు తేదీల్లో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ పరిధిలో పల్స్ పోలియో రూట్స్ సూపర్వైజర్స్, రూట్ సూపర్వైజర్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్, సిహెచ్ఒలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

చౌటపల్లె వాసులు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నలూరు పంచాయతీ చౌటుపల్లి గ్రామంలో సోమవారం 50 కుటుంబాలు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. అచ్చుకట్ల, కరీముల్లా, అమీర్ బాషా, కాసిం వల్లి, ఫక్రుద్దీన్, షరీఫ్ జాఫర్ రియాజ్, హుస్సేన్, పీరా అబ్దుల్ తదితరులు చేరారు. అనంతరం రూ.8,20,000తో మసీద్ ప్రహరీ, రూ.5 లక్షలతో ప్యూరిఫైడ్ స్వచ్ఛమైన తాగునీరు ప్లాంటును ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. అన్నలూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని రూ.23 లక్షల 96వేలతో నిర్మించారు. అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మైదుకూరు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, తహశీల్దార్ వై.నరేంద్రనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల గురించి ప్రచారం చేస్తున్న రేవతి

ఆరు పథకాలతో విజయం సాధిస్తాం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాబోయే ఎన్నికల్లో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన ఆరు పథకాలతోనే విజయం సాధిస్తామని టిడిపి నియోజకవర్గ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని బొజ్జావారిపల్లి, వెంకటరెడ్డిపల్లి, మాధవ రంపాడు, కె.బుడుగుంటపల్లి గ్రామ పంచాయతీల్లో మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. కొత్తగా పరిశ్రమలు రాక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాక తప్పదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

గ్రామ పంచాయతీలలో కుష్టు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్ బాబు తెలిపారు. కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కదిరాయిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియం లేప్రే అనే సూక్ష్మ క్రిమి వలన వస్తుందని తెలిపారు. ఈ క్రిమి మానవుల చర్మం, నరాల మీద ప్రభావితం చూపుతుందని తెలిపారు. చర్మం మీద రాగి రంగులో స్పర్శ లేని మచ్చలు ఏర్పడినప్పుడు వైద్య సిబ్బందిని సంప్రదించి వెంటనే చికిత్స ప్రారంభించవలెనని తెలిపారు. ఆలస్యం చేసినప్పుడు నరాలు ప్రభావితం చూపి కాళ్లు అంగవైకల్యం వస్తున్నదన్నారు. జిల్లా న్యూక్లియస్ టీమ్ అధికారి శంభూ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30వ తారీకు నుండి ఫిబ్రవరి 12వ తేదీ వరకు పంచాయతీలలో గ్రామసభలను నిర్వహించి కుష్టు వ్యాధికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించి ఉచితంగా లభ్యమయ్యే బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. ప్రైవేట్ కుష్టు వ్యాధి అర్హత కలిగిన వారికి ఎంసిఆర్ చెప్పులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కదిరాయచెరువు సర్పంచ్ కె.లక్ష్మీప్రసన్న, హెడ్మాస్టర్ సుధాకర్ ఎంపిహెచ్ఇఒ ఇ.జయరామయ్య ఎంఎం హెచ్ఎస్‌లు ఎం.వెంకటేశ్వరరావు, రెడ్డమ్మ ఆరోగ్య కార్యకర్త పి.శ్రీలక్ష్మి ఎం.సుజాత, బి.కుమారి ఆశాలు విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

క్రైం కార్నర్

పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకొంది. సిఐ పులిశేఖర్ కథనం మేరకు.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 180 ఎంఎల్ గల 48 క్వాటర్ బాటిళ్లు, 90 ఎంఎల్ గల 1350 లిక్కర్ ప్యాకెట్ల ఉన్నాయి. వాహనాన్ని సీజ్ చేసి వాల్మీకిపురం పట్టణం నమాజ్‌కట్టవీధికి చెందిన బాలనాయనగారి నరసింహులును అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ మేరకు అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని, కారును సీజ్ చేసి, వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా, కర్ణాటక మద్యంను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించక చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మండలంలో ఎక్కడా నాటుసారా తయారీ, విక్రయాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు ఆజాద్ నగర్‌లో చోరీ

ప్రజాశక్తి-పీలేరు

ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండితో సహా నగదు చోరీకి పాల్పడిన సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఆజాద్ నగర్ (రైల్వే గేటు వీధి)లో నివాసముంటున్న అల్లాభకష్ భార్య బషీరున్, ఆమె కోడలు, పిల్లలతో కలిసి ఆదివారం పట్టణంలోనే తమ బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఇంటి తాళం పగుల గొట్టి, లోపలికి చొరబడి బీరువాలోని జత చెవి కమ్మలు, జుంకీలు, 3 ఉంగరాలు, కాళ్ళ గొలుసులతో సహా రూ.21 వేలు నగదు, ఇంటి రిజిస్టేషన్ పత్రాలు దొంగలించుకు వెళ్లారని బాధితులు తెలియజేశారు. చోరీకి పాల్పడిన దుండగులు తమ వేలి ముద్రలు పడకుండా బ్లీచింగ్ నీటిని పోసినట్లు తెలిసింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సంఘటన స్థలం చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీరువా పగులగొట్టి బంగారు, వెండిని దోచుకెళ్లిన దొంగలు